www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

బుధవారం


23 ఏప్రిల్ 2025

## విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# ఉగ్ర ఘాతుకం

వివరాలు లోపల పేజీల్లో

## జమ్ముకశ్మీర్‌లో 28 మంది టూరిస్టుల మృతి

- పౌరులపై విచక్షణారహితంగా కాల్పులు
- మరో 20 మందికి గాయాలు
- తామే చేశామని ప్రకటించిన టీఆర్‌ఎఫ్
- సౌదీ పర్యటన కుదించుకుని భారత్ కు మోదీ

## పహిల్గామ్ అమానవీయ చర్య

### రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ



మాస్కో: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి దిగ్భ్రాంతికరమైనది, బాధాకరమైదని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ విచారం వ్యక్తం చేశారు. క్రూరమైన, అమానవీయ చర్యగా అభివర్ణించారు. ఈ దాడిని నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నట్లు ర్కొన్నారు. అమాయక పౌరులపై, పర్యాటకులపై దాడి క్షమించరానిదనిదన్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

## విడిచిపెట్టం: ప్రధాని మోదీ..



దాడి చేసిన వారిని విడిచిపెట్టేది లేదంటూ ట్వీట్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు సహాయ సహకారాలు అందిస్తాం.. ఉగ్రవాదంపై పోరాడాలన్న మా సంకల్పం దృఢమైంది.. ఈ హేయమైన చర్య వెనుక ఉన్న వారిని.. న్యాయస్థానం ముందు నిలబెడతాం అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.



## 16 మంది పేర్లను వెల్లడించిన అధికారులు

1. మనుజ నాథ్ (కర్ణాటక)
2. శివం మోగ (కర్ణాటక)
3. లెఫ్టినెంట్ విజయ్ నర్వాల్ (హరియాణా)
4. హిమాన్షి నర్వాల్ (హరియాణా)
5. శుభం ద్వివేది (ఉత్తరప్రదేశ్)
6. దిలీప్ దేస్లే (మహారాష్ట్ర)
7. అతుల్ మోహనే (మహారాష్ట్ర)
8. సయ్యద్ హుస్సేన్ షా (అనంతనాగ్)
9. సుదీప్ నెవ్‌పానే (నేపాల్)
10. బితన్ అద్కేరి ఉద్వానీ కుమార్ (యూఎఇ)
11. సంజయ్ లేలే
12. హిమ్మత్ కలథాయ్
13. ప్రశాంత్ కుమార్
14. మనీష్ రాజన్
15. రామచంద్రన్
16. షాలిందర్ కల్పియా

**గాయపడిన వారి పేర్లు..**

1. వినో భట్ (గుజరాత్)
2. ఎస్ బాలచంద్రు (మహారాష్ట్ర)
3. అభిజవన్ రావు (కర్ణాటక)
4. సంత్రు (తమిళనాడు)
5. సాహసి కుమారి (ఒరిస్సా)
6. డాక్టర్ పరమేశ్వర్
7. మాణిక్ పాటిల్
8. రినో పాండే

## భారత్ కు అండగా ఉంటా..


**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడిలో 30 మంది అమాయకులు చనిపోయారన్న విషయం తెలిసి చాలా బాధపడ్డా. మృతులందరికీ నివాళులు అర్పించారు. ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు మద్దతిస్తా, అండగా ఉంటా. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి పూర్తి సహకారం అందిస్తా.

## ఉగ్ర పోరులో భారత్ తో నడుస్తాం

**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్**



జమ్మూకశ్మీర్ పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి విచారం. క్రూరమైన నేరం. ఉగ్రదాడులు సమర్థనీయం కాదు. నేరస్థులకు తగిన శిక్షను విధించాలి. ఉగ్రవాదంపై పోరులో భారత్ తో సహకారాన్ని మరింత పెంచుకోవడానికి తాము కట్టుబడి ఉన్నాం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఉగ్ర ఘాతుకం

**కలంజ్యోతి, శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డారు. ప్రముఖ టూరిస్ట్ స్పాట్ పహల్గామ్‌లో పర్యాటకులను టార్గెట్ చూస్తూ.. ఉగ్రమూకలు మంగళవారం విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకల కాల్పుల్లో 28 మంది మరణించగా.. 20 మందికి పైగా గాయాలైనట్లు తెలుస్తున్నది. దీంట్లో చాలా మంది మృత్యువుతో పోరాడుతున్నట్లు పేర్కొంటున్నారు. మృతి చెందిన వారిలో హైదరాబాద్ వాసి, కర్నాటక వ్యాపారి ఉన్నట్టు చెబుతున్నారు. క్షతగాత్రుల్లో మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ , ఒడిశా వాసులు ఉన్నట్టు తెలుస్తున్నది. ఉగ్రమూఖలు ఐడీ కార్డులను చూసి మరీ కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ముస్లింలు, మహిళలు, చిన్నారులను మినహాయించి హిందూ పురుషులే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడ్డ ఓ మహిళా టూరిస్ట్ సమాచారం ఇవ్వడంతో కాల్పుల ఘటన గురించి అధికారులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న భద్రతా బలగాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. సంఘటనా స్థలానికి భారీగా భద్రతా బలగాలు చేరుకుని కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. దాడికి పాల్పడింది తామేనని ఉగ్రవాద సంస్థ టీఆర్ఎఫ్ ప్రకటించింది. పహల్గామ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన టూరిస్టులపై ఒక్కసారిగా కాల్పులు జరిపారు.. ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఉగ్రవాదుల కాల్పుల్లో గుజరాత్, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, కర్నాటకకు చెందిన పర్యాటకులకు గాయాలయ్యాయి.. మృతుల్లో విదేశీ టూరిస్టులు కూడా ఉన్నారు. ఇజ్రాయెల్, ఇటలీకి చెందిన టూరిస్టుల మృతి చెందినట్లు తెలుస్తున్నది. ఈ ఘటనపై కేంద్రం సీరియస్ అయ్యింది. సౌదీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఫోన్ చేశారు. ఉగ్ర దాడిపై ఆరా తీశారు. అమిత్‌షాను పహల్‌గామ్‌కు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రధాని మోదీ సూచనలతో అమిత్ షా అత్యున్నత సమావేశానికి పిలుపునిచ్చారు.. అనంతరం హుటాహుటిన జమ్మూ కశ్మీర్ కు బయలు దేరి వెళ్లారు. ఉగ్రవాద దాడి తర్వాత, పర్యాటకుల సహాయం, సమాచారం కోసం అనంత్‌నాగ్‌లో అత్యవసర సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. పోలీసులను సంప్రదించడానికి, 9596777669, 01932 225870 (9419051940 వాట్సాప్) హెల్ప్‌లైన్ నంబర్లు జారీ చేశారు. కాగా.. కాల్పులు జరిపిన ఉగ్రవాదుల కోసం ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి. పహల్‌గామ్‌లో అమర్‌నాథ్ యాత్రికుల బేస్ క్యాంప్ ఉంటుంది. ఇప్పటికే అమర్‌నాథ్ యాత్ర కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యింది. ఇదే సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడం తీవ్ర కలకలం రేపింది.

### సౌదీ పర్యటన కుదించుకుని భారత్ కు మోదీ


సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ విషయం తెలుసుకున్న తక్షణమే తన పర్యటనను కుదించుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఈ విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. బుధవారం తెల్లవారుజామున మోదీ భారత్ కు చేరుకున్నారు. ఢిల్లీలో దిగిన వెంటనే అత్యవసర క్యాబినెట్ సమావేశానికి ఆదేశాలు జారీ చేశారు.



ఉగ్ర దాడిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

### దుశ్చర్యను ఖండిస్తున్నా.. సీఎం రేవంత్ రెడ్డి

ఉగ్రవాదుల దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. భారత్‌ను దొంగదెబ్బతీసి భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.



# అనుమతి గోరంత - నిర్మాణం కొండంత!

- విధులు మరచిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- డీసీ సాబ్ జెర దేకో!
- అక్రమ నిర్మాణాలు సెటిల్ మెంట్ శంకర్ల అండతో!




**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్:** గాజుల రామారం సర్కిల్ పరిధిలో ఒకే నిర్మాణానికి కొంతమేర అధికారికంగా జీహెచ్ఎంసీ అధికారులు అనుమతి ఇస్తుండగా అదే బిల్డింగ్ నిర్మాణానికి కొందరు సెటిల్మెంట్ శంకర్ లు అనధికారికంగా అదనపు అంతస్థులకు అనుమతులు ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తమ ముడుపులు తమకు అందితే చాలు అనుకుంటున్నారో లేదా స్థానిక ఖద్దరు నేతల అడుగులకు మడుగులోత్తుతున్నారో గాజుల రామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులైతే మాత్రం అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహారిస్తున్నారు.

**జీ+2 అనుమతితో జీ+5 నిర్మాణం!**

గాజులరామరం డివిజన్ పరిధిలోని మహాదేవపురంలో ఓ నిర్మాణదారుడు తమ అతి తెలివిని ఉపయోగించి జీ+2 కు అనుమతి తీసుకుని జీ+5 ల్డింగ్ నిర్మాణం చేపడుతున్నాడు. అనుమతికి మించి నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారీతిన నిర్మాణం చేపడుతున్నా సర్కిల్ సెక్షన్ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకుండా తాత్సరం చేయడం పలు అనుమానాలకు తావిస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నరు. ఇప్పటికైనా గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దృష్టిసారించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కొండగట్టులో భక్తుల రద్దీ




**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మం గళవారం భక్తుల రద్దీ నెలకొంది. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుండే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి సేవలో తరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



## పిట్ల శంకర్ కు సన్మానం

### శుభాకాంక్షలు తెలిపిన శ్రావణ్ కుమార్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడుగా మంగళ వారం పిట్ల శంకర్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా పీపుల్స్ న్యూస్ తెలుగు దినపత్రిక ఎడిటర్, మేనేజింగ్ డైరెక్టర్ కే శ్రావణ్ కుమార్ గాజుల రామారంలోని పత్రిక కార్యాలయంలో కుత్బుల్లాపూర్ (టీడబ్ల్యూ జెఎఫ్) కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు పిట్ల శంకర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ లో జర్నలిస్టులు ఎదు ర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇవ్వాల్సిన టువంటి బెనిఫిట్స్ పై ఇరువురి మధ్య చర్చ జరిగింది. అనంతరం పిట్లా శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.








## నూకపల్లి ఆదర్శ కళాశాలలో విద్యార్థులు ప్రభంజనం

**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలోని నూకపల్లి ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. బైపిసి విభాగంలో డీ.ఈశ్వరి 965, నిహారిక 945, ఎంపీసీ విభాగంలో సంపత్ కుమార్ 928, శ్రావణి 929, సీఈసీ విభాగంలో అనిరుథ్ 819 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ నుంచి బి.వర్షిణి 461, బీ.వైశాలి 448, పీ. శ్రీనిధి 448, బైపీసీ నుంచి వర్షిణి 389, సీఈసీలో ఏ.శరణ్య 425 మార్కులను సాధించారు ఇంటర్మీడియట్ సెకండియర్ లో 96 శాతం, మొదటి సంవత్సరంలో 84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తంగా 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ జీ.ఆదిత్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, గంగాధర్, రమేష్, అభినందించారు.



# రికార్డు ఉష్ణోగ్రతలు

- తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు
- 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలో ఎండలు రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయి. మొన్నటి వరకు చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎండలు రాష్ట్ర వ్యాప్తంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దాంతో అప్రమత్తమైన వాతావరణ శాఖ అధికారులు రాష్ట్ర ప్రజలను అలర్ట్ చేశారు. వచ్చే మూడు రోజుల పాటు తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజుల పాటు 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వనున్నాయి. హైదరాబాద్ లోనూ ఎండల తీవ్రత అధికంగా ఉండనుందని.. నగర వ్యాప్తంగా 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా అవసరమైతే తప్ప మధ్యాహ్నం పూట బయటకు రావొద్దని ప్రజలను హెచ్చరించారు. ఒక వేళ ఎవరైనా పని నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే శరీరానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ నీళ్లు తాగుతూ ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు.

# నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు

## రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**కలంజ్యోతి, నిర్మల్:** ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీని వాస్ రెడ్డి కోరారు. మంగళ వారం ఆయన సభ్యు లతో కలసి జిల్లాలో పర్యటించారు. సారంగాపూర్ మండలం చించోలి బిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన బృందంతో కలిసి తనిఖీ చేశారు. చిన్నపి ల్లలు, గర్భిణులకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించి, ఎలాంటి అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు. తర్వాత జామ్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, వారికి అందుతున్న ఆహారంపై సమాచారం సేకరించారు. మెనూ ప్రకారం భోజనం అందు తోందా? అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారం తీసుకుని శారీరక దృఢత్వం పెంపొం దించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని, సోన్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అవసరమని అన్నా రు. కడ్తాల్ గ్రామంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన ఆయన, పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపె




ట్టిన సన్నబియ్యం పథకం అర్హులకు చేరేలా చూడాలని రేషన్ డీలర్లకు సూచించారు. కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కమిషన్ సభ్యులు వి.ఆనంద్, ఆర్.శారద, ఎం.భారతి, బి.జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఈఓ పి.రామారావు, డిఎంహెచ్వో రాజేందర్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, జిల్లా సంక్షేమశాఖ అధికారులు శ్రీనివాస్, రాజేశ్వర్ గౌడ్, మోహన్ సింగ్, అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

# మర్రి జనార్ధన్‌రెడ్డికి శ్యామల కృతజ్ఞతలు

## ఎంబీబీఎస్ చదువకు సహకరించిన ఎంజేఆర్ ట్రస్ట్

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్:** తన ఎంబీబీఎస్ చదువుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డికి శ్యామల మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. బీజినపల్లి మండలంలోని ఊడుగులకుంటా తండాకు చెందిన కట్రావత్ పాండు నాయక్ చంది దంపతుల కుమార్తె కట్రావత్ శ్యామల. నాలుగేళ్ల కిందట ఎంబీబీఎస్ సీటు వచ్చినా పేదరికంతో చదివే పరిస్థితి లేదు. దాంతో విషయం తెలుసుకున్న ఎంబీబీఎస్ చదువుకు పూర్తి అయ్యేవరకు అండగా ఉంటానని అప్పటి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ పూర్తి అయ్యేవరకు చదివిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం ఫీజు చెల్లించి ఎంబీబీఎస్ పూర్తి అయ్యే వరకూ అండగా నిలిచారు. దాంతో శ్యామల ఇటీవలే ఎంబీబీఎస్ ను పూర్తి చేసుకున్నారు. తన తల్లిదండ్రులతో మాజీ శాసన సభ్యులు ఎంజేఆర్ ట్రస్ట్ అధినేత మర్రి జనార్ధన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ.. వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా మర్రి జనార్ధన్ రెడ్డి దంపతులు శ్యామలను సన్మానించి అభినందించారు.



కలంజ్యోతి
బుధవారం 23.04.2025 General News




జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిలో
# కీలక సూత్రధారి వీడే?

- పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రదాడి
- తమ పనేనని టీఆర్ఎఫ్ వెల్లడి
- దాడుల వెనుక ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హస్తం
- 2026 ఫిబ్రవరి 2 నాటికి కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామని వెల్లడి

**జమ్మూ కశ్మీర్ :** జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రవాద దాడి యావత్ దేశాన్ని కుదిపేసింది. ఈ దాడిలో ఇప్పటి వరకు 28 మంది మరణించినట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదు. ఈ దాడికి బాధ్యతను టీఆర్ఎఫ్ అనే ఉగ్రవాద సంస్థ తీసుకుంది. ఈ సంస్థ పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'గా గుర్తించారు. జమ్మూ కాశ్మీర్‌లో లష్కరే, టీఆర్ఎఫ్ ఉగ్రవాద కార్యకలాపాల వెనుక ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హస్తం ఉందని వర్గాలు వెల్లడించాయి. ఈ దాడులకు అతనే ప్రధాన సూత్రధారి అని తెలుస్తోంది. ఈ వార్తను జాతీయ మీడియా సంస్థ "ఆజ్‌తక్" క్లైమ్ చేసింది.

ఆజ్‌తక్ ప్రకారం.. లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ సైఫుల్లా ఖలీద్‌ను సైఫుల్లా కసూరి అని కూడా పిలుస్తారు. అతనికి భారతదేశ అతిపెద్ద శత్రువు వైన హాఫీజ్ సయీద్‌కు చాలా దగ్గర సంబంధాలు ఉన్నాయి. భారతదేశంలో జరిగిన అనేక ప్రధాన ఉగ్రవాద దాడులలో వీడి పేరు ప్రస్తావించబడింది. వీడు ఎప్పుడూ లగ్జరీ కార్లతో ప్రయాణిస్తాడట. ఎల్లప్పుడూ అత్యాధునిక ఆయుధాలను కలిగి ఉంటాడట. పాకిస్థాన్‌కి చెందిన సైనిక అధికారులు కూడా వీడిపై పూల వర్షం కురిపిస్తారట. వీడిని పాకిస్థాన్ ఆర్మీ సైనికులను రెచ్చగొట్టడానికి వాడుతారట. తాజా ఉగ్రవాద దాడికి కేవలం రెండు నెలల ముందు, సైఫుల్లా ఖలీద్ పాకిస్థాన్ పంజాబ్‌లోని కంగన్‌పూర్‌కు చేరుకున్నాడు. అక్కడి పాకిస్థాన్ బెటాలియన్ ఉంది. పాకిస్థానీ ఆర్మీ కల్నల్ జాహిద్ జరీన్ ఖట్టక్.. జిహాదీ ప్రసంగం చేయడానికి ఈ మూర్ఖుడిని ఆహ్వానించాడు. ఈ సైఫుల్లాఈ ఖలీద్ అక్కడికి చేరుకోగానే పాక్ కల్నల్ స్వయంగా అతనిపై పూల వర్షం కురిపించాడు. వీడి ప్రసంగం పాకిస్థాన్ సైన్యాన్ని తీవ్రంగా రెచ్చగొట్టింది. భారతీయ సైనికులను ఎంత ఎక్కువగా చంపితే, అల్లాహ్ వారికి అంత ఎక్కువ ప్రతిఫలం ఇస్తాడని ఈ మూర్ఖుడు ప్రసంగంలో చెప్పాడట.

### 2026 ఫిబ్రవరి 2 నాటికి కశ్మీర్ స్వాధీనం..

ఈ సమావేశంలో భారత్ పై విద్వేశ వ్యాఖ్యలను చిమ్మాడు. భారత సైనికులపై దాడులు చేయాలన్నాడు. 2026 ఫిబ్రవరి 2 నాటికి తామే కశ్మీర్ ను స్వాధీనం చేసుకుంటామని శపథం చేశాడు. రాబోయే రోజుల్లో దాడులను తీవ్రతరం చేస్తామని ఆ సమావేశంలో అనుచిత, భారత్ పై విద్వేష పూరిత ప్రసంగం చేశాడు. భారత్ ఇంటలిజెన్స్ నివేదికల ప్రకారం పాక్ లోని అబోటబాద్ అడవుల్లో ఇతని ఆధ్వర్యంలో వందలాది మంది పాక్ యువతను ఉగ్రబాట పట్టిస్తున్నారు. అనంతరం వారికి శిక్షణ ఇచ్చి సరిహద్దుల ద్వారా భారత్ లోకి చొరబాట్లను,దాడులను ప్రోత్సహిస్తున్నాడు. విషయాన్ని గుర్తించిన కేంద్ర హోంశాఖ అప్రమత్తమై 2019లో టీఆర్ ఎఫ్ సంస్థపై ఉపా చట్టం కింద నిషేధం విధించారు.











- హిరోషిమాలో సీఎం రేవంత్ బృందం
- రూ.12,062 కోట్ల పెట్టుబడులు
- శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి
- విలువలను పంచుకుందాం
- క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటి, మ్యానుఫాక్చరింగ్,
- గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలు

## రూ. 12 వేల కోట్ల పెట్టుబడులు

తెలంగాణ రైజింగ్ బృందం జపాన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ నెల 15న జపాన్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన సీఎం టీమ్.. మొత్తం రూ.12,062 కోట్ల పెట్టుబడులతో పాటు సుమారు 30,500 ఉద్యోగాలు సాధించింది. అలాగే మూసీ పునరుజ్జీవంతో పాటు ఆ దేశంలో అమలవుతోన్న సంస్కరణలను నిశితంగా పరిశీలించింది. పెట్టుబడుల విషయానికి వస్తే..హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మారుబెని కంపెనీ ముందుకుచ్చింది. ఇందులో భాగంగా రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ రైజింగ్ టీంతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఇందులో ప్రాథమికంగా రూ. 5వేల కోట్ల పెట్టుబడుల అంచనాతో హైదరాబాద్ యువతకు 30వేల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. హైదరాబాద్‌లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఎన్ టీ టీ డేటా, నెయిసా ఒప్పందం కుదుర్చుకున్నది. ఇందులో రూ.10,500 కోట్ల పెట్టుబడులకు ముందుకువచ్చింది. అలాగే తోషిబా ట్రాన్స్ మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా కంపెనీ రూ. 562 కోట్లతోరుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామాగ్రి తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకువచ్చింది. టామ్ కామ్తో టెర్న్, రాజ్ గ్రూప్ జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు ఒప్పందం కుదుర్చుకున్నది. ఇలా వారం రోజుల పాటు జపాన్ లో విస్తృతంగా పర్యటించిన ముఖ్యమంత్రి బృందం మంగళవారం టూర్ ను ముగించుకున్నది. నేడు సాయంత్రం తెలంగాణ రైజింగ్ టీం తెలంగాణలో అడుగుపెట్టనున్నది.



# ఆవిష్కరణలు, సుస్థిర విధానాలకు
# కట్టుబడి ఉన్నాం



**కలంజ్యోతి, హైదరాబాద్:** శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందని వెల్లడించారు. శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని పిలుపునిచ్చారు. ఇరు దేశాలు కలిసికట్టుగా సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని చెప్పారు. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ బృందం మంగళవారం అక్కడి హిరోషిమా ప్రి ఫెక్చర్ (రాష్ట్ర ప్రభుత్వం) ను సందర్శించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ బృందం సభ్యులు హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ లో విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రస్తావించారు. వీటితో పాటు విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు, బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు. హిరోషిమా మాదిరిగానే ప్రజలు ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి తెలంగాణ చిహ్నమనీ దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం అని చెప్పారు. మంత్రి శ్రీధర్బాబు మాట్లాడుతూ శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని అక్కడి ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పని చేస్తున్నాయన్నారు. మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రిసిసన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయని వెల్లడించారు. తెలంగాణను సందర్శించి, రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. తెలంగాణ దేశానికి గేట్ వేగా.. ప్రపంచానికి విస్తరించే వేదికగా ఉంటుందని అన్నారు. హిరోషిమా హైదరాబాద్, జపాన్ తెలంగాణ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దామని కోరారు.అసెంబ్లీ సందర్శన తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం, శాసనసభ్యుల బృందం రేవంత్ రెడ్డి బృందాన్ని గాంధీ మెమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్‌ల వద్దకు తీసుకెళ్లింది.

